క్లుప్తంగా

సీఎం సాయం అందజేత


మహాలక్ష్మికి చెక్కు అందజేసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారుకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇటీవల సామర్లకోటకు వచ్చినపుడు స్థానిక మహిళ సారా మహాలక్ష్మి ఆయనను కలసి తన సమస్య వివరించారు. దీనిపై ఆయన వెంటనే రూ.లక్ష ఆర్థిక సాయం చేశారని, ప్రస్తుతం మరో రూ.2.75 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు వచ్చినట్టు దవులూరి తెలిపారు. పట్టణ సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్నం దొరబాబు, అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడలు


పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థులు

పెద్దాపురం: దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాన్ని, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మహాత్మాగాంధీ మున్సిపల్ స్కూల్ హెచ్‌ఎం ఎంఎల్ శివజ్యోతి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాఠశాలలోని భవిత ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించారు. భవిత సహిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు సేవలందించడం ఓ వరమని, అది భవితకు దక్కడం వారి అదృష్టమని, ప్రతి ఒక్కరూ దివ్యాంగులకు చేయూతగా నిలవాలని సూచించారు. అనంతరం మండల స్థాయిలో దివ్యాంగుల క్రీడల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు


బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేస్తున్న అర్చకులు

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

డీఆర్‌డీఏ పీడీ


సిబ్బందితో సమీక్షిస్తున్న పీడీ శ్రీరమణి

సామర్లకోట: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి సిబ్బందికి సూచించారు. స్థానిక టీటీడీసీలో డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆమె పాల్గొన్నారు. ప్రతి మండలానికి ఇచ్చిన లక్ష్యాలను గడువు లోగా పూర్తి చేయాలన్నారు. ఎంపీఎంలు, ఏసీలు, సీసీలు ప్రతి గ్రామంలో పర్యటించి లబ్ధిదారుల జాబితాలను తయారు చేయాలన్నారు. ఈ మేరకు జిల్లాలోని 20 మండలాల సీసీలతో సమీక్షించారు. డీపీఎంలు బి.వెంకటేశ్వరరావు, రాయ్, టి.అశోక్ భరత్, పద్మావతి, బాబురావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు శుక్రవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని రవీంద్రపురం బస్ షెల్టర్ వద్ద అనారోగ్యంతో గుర్తు తెలియని మహిళ బాధపడుతుండగా ఈ నెల 5న ఆమెను చికిత్స నిమిత్తం 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఆమె వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, మృత దేహాన్ని మార్చురీలో భద్రపరిచామన్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు స్థానిక ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గొల్లప్రోలులో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు


వాకతిప్పలో నేలనంటిన వరి పొలాలు

చివరి గింజలకు పరితపన

పిఠాపురం/కొత్తపల్లి: అన్నదాతలపై ప్రకృతి కన్నెర్ర జేస్తోంది. ఏటా ఆరుగాలం శ్రమించిన పంట చేతికందే సమయంలో వరదలు, తుపానులు సంభవించి రైతులకు నష్టాన్ని మిగుల్చుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి ప్రతికూల వాతావరణం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాభావ పరిస్థితుల నడుమ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని సాగు చేసిన పంట చివరికి నీటిపాలయ్యింది. మిచాంగ్ తుపాను ప్రభావంతో విస్తారంగా కురిసిన వర్షాలకు పిఠాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కోసి పనలపై ఉన్న వరి పంట తడిసిపోయింది. కొన్ని గ్రామాల్లో పక్వానికి చేరిన వరిపంట నేలకొరిగింది. పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ప్రస్తుతం వాతావరణం తెరిపి ఇవ్వడంతో రైతులు పంట ఒబ్బిడి చేసే పనిలో బిజీగా ఉన్నారు.


మొలకెత్తిన వరిని చూపుతున్న రైతు


మునిగిన వరి దుబ్బులను కట్టలుగా కడుతున్న రైతు

వరి కుప్పల్లోకి చేరిన నీరు

పంట పొలాల్లో వేసిన వరి కుప్పలు సైతం నీట మునిగాయి. కోసి పనలపై ఉన్న వరి పంట పూర్తిగా దెబ్బతింది. పలు గ్రామాల్లో వరి పనలకు మొలకలు వచ్చాయి. ఈదురు గాలులకు అరటి, కూరగాయల పంటలు దెబ్బతిన్నారు. నూర్పి కళ్లాల్లో వేసిన ధ్యాన్యం రాశులు వర్షానికి తడిసి ముద్దయ్యాయి.

విస్తృతంగా పర్యటిస్తున్న అధికారులు

వ్యవసాయాధికారులు కష్టకాలంలో రైతులకు అండగా నిలుస్తున్నారు. తుపానుకు పంట దెబ్బతిన్న ప్రాంతాల్లో అధికారులు విస్తృతంగా పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే దొరబాబు
- గొల్లప్రోలులో సీసీ రోడ్లు, డ్రైన్లు ప్రారంభం


సీసీ రోడ్లు, డ్రైన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని 5వ వార్డుల్లో రూ.2.45 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేని ఎల్లో మీడియా, పచ్చ చొక్కా నాయకులు ప్రభుత్వంపై బురద జల్లుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 స్థానాల్లోనూ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. మున్సిపల్ చైర్మన్ గంద్రేటిమంగతాయారు, వైఎస్సార్ సీపీ నాయకులు మొగిలి అయ్యారావు, మొగిలి బాబ్జీ, గంద్రేటి శ్రీరామ చంద్రమూర్తి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మైనం రాజా, పట్టణ సచివాలయాల కన్వీనర్ మొగిలి శివ, వార్డు కౌన్సిలర్ సింగం నాగేశ్వరావు, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాదగయ క్షేత్రంలో కృష్ణంరాజు భార్య పూజలు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రాన్ని దివంగత మాజీ మంత్రి, సినీ హీరో రెబల్‌స్టార్ కృష్ణంరాజు భార్య శ్యామలాదేవి శుక్రవారం దర్శించారు. ఆమెకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అర్చకులు క్షేత్రం విశిష్టతను వివరించారు. ఆమె ఆలయంలో కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురూహూతికా అమ్మవారు, దత్తాత్రేయ స్వామివార్లను దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆమె ఆలయ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఈవో వడ్డి శ్రీనివాసరావు పట్టువస్త్రాలు, ప్రసాదం అందజేశారు.


కృష్ణంరాజు భార్య శ్యామలాదేవికి పట్టువస్త్రాలు అందిస్తున్న అధికారులు

పంచారామ క్షేత్రంలో విశేష పూజలు


- భక్తజనంతో ఆలయం కిటకిట
- స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శంకరరావు దంపతులు


ఎమ్మెల్యే శంకరరావు దంపతులను సత్కరిస్తున్న ఆలయ అధికారులు, దొరబాబు తదితరులు

సామర్లకోట: కార్తిక బహుళ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అశేష భక్తజనం మధ్య తెల్లవారు జామున గోపూజ, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ధ్వజ స్తంభం వద్ద, జమ్మి, రావి, మారేడు చెట్ల వద్ద, తులసి మొక్కల వద్ద భక్తులు దీపాలను వెలిగించారు. ఆలయ ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి భక్తులు కోనేటి నీటిని బిందెలతో అభిషేకాలు చేశారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంత కుమారి దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. పండితులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా శంకరరావు దంపతులను రాష్ట్ర హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు సత్కరించారు.

ప్రజ్వరిల్లిన జ్యోతులు

స్థానిక పంచారామ క్షేత్రంలో శుక్రవారం రాత్రి జ్యోతిర్లింగార్చన ఆకట్టుకుంది. కార్తిక మాసంలో శివాలయంలో దీపాలు వెలిగిస్తే మంచి ఫలితాలు వస్తాయనే విశ్వాసంతో భక్తులు దీపాలు వెలిగించడానికి పోటీ పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి పూజలు, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.


పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ భవిత కేంద్రంలో శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓ వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, అమీనాబాద్ సర్పంచ్ నక్కా మణికంఠ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. తొలుత దివ్యాంగులతో కేక్ కట్ చేయించారు. అమీనాబాదుకు చెందిన దాత దేవాన్ రాజు వికలాంగులు కూర్చునేందుకు అవసరమైన టేబుల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు గణేష్, సీహెచ్ లోవరాజు, ఎ.మేరీ తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు దాత అందించిన టేబుల్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

‘ఆడుదాం ఆంధ్రా’ పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. పిఠాపురం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. గ్రామాల్లోని నాయకులు, అధికారులు సమన్వయంతో క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గండేపల్లి బాబీ, బాలిపల్లి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై యువత దృష్టి సారించాలి

కొత్తపల్లి: గ్రామాల్లో యువత క్రీడలపై దృష్టి పెట్టాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం నుంచి మంజూరైన ఆడుదాం ఆంధ్రా క్రీడా పరికరాలను శుక్రవారం గ్రామ సచివాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను గుర్తించి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో వారి ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఆసక్తి గల యవతీయువకులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వాకతిప్ప సర్పంచ్ పాలాని దొరబాబు, ఎంపీడీఓ వెంకట నారాయణ, ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఉపాధి హామీ ఏపీఓ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆడుదాం ఆంధ్రా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు


నాయకులకు క్రీడా పరికరాలను అందిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

పీఆర్ చట్టాలపై మరింత అవగాహన అవసరం

- పంచాయతీ ఆదాయ వనరులపై దృష్టి సారించాలి
- కార్యదర్శులకు శిక్షణ తరగతుల్లో ఎంపీడీఓలు అశోక్‌కుమార్, శ్రీలలిత

పెద్దాపురం/సామర్లకోట: పంచాయతీ రాజ్ చట్టాలపై పంచాయతీ, సచివాలయ కార్యదర్శులకు మరింత అవగాహన అవసరమని పెద్దాపురం, సామర్లకోట ఎంపీడీఓలు బి.అశోక్‌కుమార్, డి.శ్రీలలిత అన్నారు. పంచాయతీ రాజ్ చట్టాలు, కార్యదర్శుల విధులు, నిర్వహణ అంశాలపై శుక్రవారం ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. పెద్దాపురంలో మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అధ్యక్షతన, సామర్లకోటలో ఎంపీడీఓ స్వయంగా పీఆర్ చట్టాలపై అవగాహన కల్పించారు. పంచాయతీల్లో పాలకవర్గ సమావేశాల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం, ఆదాయ వనరులపై దృష్టి సారించి ప్రజావసర సుపరిపాలనలో సిబ్బంది భాగస్వాములు కావాల్సి ఉందన్నారు. పంచాయతీ సమావేశాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పని సరిగా నిర్వహించాలని, అజెండాలో గ్రామాభివృద్ధి కార్యక్రమాలను పొందుపర్చి సభ్యుల ఆమోదం తీసుకోవాలని సూచించారు. బడ్జెట్ తయారీ, పంచాయతీ పరిధిలో ఆస్తుల వివరాలను సేకరించాలని తెలిపారు. పెద్దాపురంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్ పీఆర్ చట్టాలపై అవగాహన కల్పించగా నక్కా మూర్తి, జ్యోతుల పద్మరాజు, ఈశ్వరరావు, వరసాలన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సామర్లకోటలో ఈఓపీఆర్డీ క్రరి హరికృష్ణ సత్యారెడ్డి ఎంఈఓ నాగఫణికుమార్ శిక్షణ ఇచ్చారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్



సామర్లకోటలో నిర్వహిస్తున్న శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలలిత

బిక్కిన దంపతులకు దవులూరి పరామర్శ

పెద్దాపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల కో–ఆప్షన్ సభ్యుడు బిక్కిన వీరేషకుమారి, శ్రీనివాస్ దంపతులను ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శుక్రవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని దొరబాబు ఆకాంక్షించారు. ఆయన వెంట పీఏసీఎస్ అధ్యక్షులు చల్లా చిన వీర్రాజు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి తదితరులున్నారు.

జగన్‌తోనే సంక్షేమం

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి
- రాయభూపాలపట్నంలో వై ఏపీ నీడ్స్ జగన్


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న దవులూరి దొరబాబు

పెద్దాపురం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని రాయభూపాలపట్నం గ్రామంలో శుక్రవారం ‘వై ఏపీ నీడ్స్ జగన్’ నిర్వహించారు. సర్పంచ్ చీకట్ల లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధినీ గుర్తించి రెండో దఫా వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలకాలని ఆయన కోరారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిపై వివరించారు. తొలుత పార్టీ జెండా, సంక్షేమం, అభివృద్ధి బోర్డును దొరబాబు ఆవిష్కరించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, సొసైటీ అధ్యక్షులు నల్లల నాగేంద్రబాబు, పరిమి శ్రీను, పుట్టా వెంకట్రావు, ముత్యాల రాజబ్బాయి, పెంకే రాంబాబు, నల్లల గోవిందు తదితరులు పాల్గొన్నారు.


ఉప్పాడలో డిజిటల్ బోర్డును ఆవిష్కరించిన నాయకులు

లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధిదారుల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. మండలంలోని ఉప్పాడలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం–3లో అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలిపే ఫ్లెక్సీని ఆవిష్కరించారు. గ్రామ ప్రధాన సెంటర్‌లో పార్టీ జెండాను ఎగుర వేశారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లకు పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్, ఈఓపీఆర్డీ భాస్కరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌కు సంస్థలను కేటాయించండి

- కలెక్టర్ కృతికా శుక్లా
- స్కిల్ డెవలప్‌మెంట్‌పై అధికారులకు ఆదేశం


స్కిల్ డెవలప్‌మెంట్‌పై వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలోని డిగ్రీ, ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఆరు నెలల ఇంటర్న్‌షిప్ పూర్తి చేసేందుకు విద్యార్థులను సంబంధిత ప్రభుత్వ శాఖలకు, ప్రైవేట్ సంస్థలకు కేటాయించాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో జేఎన్‌టీయూ, నన్నయ వర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలల్లో డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జనవరి 2024 నుంచి ఆరు మాసాలు శిక్షణ పూర్తి చేసేందుకు వారి విద్యకు సంబంధించిన ప్రభుత్వ శాఖలకు, ప్రైవేట్ సంస్థలకు విద్యార్థులను కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ కళాశాల విద్యార్థిని ఏ శాఖకు, ఏ సంస్థకు కేటాయించారో వాటి వివరాలను పూర్తి స్థాయిలో అందజేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో జేఎన్‌టీయూకేకు అనుబంధంగా ఉన్న కళాశాలలో 6,338 మంది విద్యార్థులు, నన్నయ వర్సిటీ పరిధిలో 9,054 మంది విద్యార్థులు మొత్తం 15,392 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తి చేసేందుకు 50 శాతం మంది ప్రభుత్వ సంస్థల్లోను, 50 శాతం ప్రైవేట్ సంస్థల్లోనూ కేటాయించాలని, అదే సమయంలో విద్యార్థులను అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వికాస పీడీ కె.లచ్చారావు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆదిశేషు, జెడ్పీ సీఈవో ఎ వెంకటరమణారెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో జె నరసింహ నాయక్, వ్యవసాయశాఖ జేడీ ఎన్.విజయకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్విజ్‌లతో జ్ఞాన విస్మృతి

కాకినాడ సిటీ: జ్ఞాన విస్తృతితో పాటు, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే క్విజ్ పోటీలలో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొనాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. ధీరూబాయి అంబానీ జయంతిని పురస్కరించుకుని రిలయన్స్ ఇండస్ట్రీస్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవన్ ఆడిటోరియంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9, 10 తరగతులు చదువుతున్న సుమారు 600 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగవద్దు : ఎస్పీ

కాకినాడ లీగల్: బహిరంగ ప్రదేశాల్లో గొడవలు, కొట్లాటలు, మద్యం తాగేవారిపై చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ,పెద్దాదపురం సబ్ డివిజన్ పోలీసు స్టేషన్ ప్రాంతాల్లో మద్యం తాగి హంగామాలు నడిపేవారిపై, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిపై, గొడవలు, కొట్లాటలు, భౌతిక దాడులకు పాల్పడినా ఏ మాత్రం ఉపేక్షించేదిలేదన్నారు. వారం రోజులలో జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ఇటువంటి వారు 280 మందికి కోర్టు జరిమానా, కొందరికి జైలు శిక్ష విధించినట్టు ఎస్పీ తెలిపారు.

సైనిక నిధిని పరిపుష్టం చేయండి

- కలెక్టర్ కృతికా శుక్లా
- గత ఏడాది విరాళాల సేకరణలో జిల్లాకు రెండోస్థానం
- గవర్నర్ చేతుల మీదుగా ట్రోఫీ ప్రదానం

కాకినాడ సిటీ: వీర సైనికులు, వారి కుటుంబాల సంక్షేమ నిధికి ప్రజలు, వ్యాపార, వాణిజ్య పారిశ్రామిక సంస్థలు విరివిగా విరాళాలు అందించాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. 2022 సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రూ.46,83,533 విరాళాన్ని సేకరించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ఇందుకు ప్రశంసిస్తూ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గురువారం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన–2023 సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాకు ట్రోఫీని అందజేశారు. గవర్నర్ అందించిన ట్రోఫీని జిల్లా సైనిక సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్, కలెక్టర్ కృతికా శుక్లా తరఫున జిల్లా సైనిక సంక్షేమాధికారి కెప్టెన్ పి.సత్యప్రసాద్ స్వీకరించారు. తదుపరి శుక్రవారం ఆయన కలెక్టర్ కృతికా శుక్లాను ఆమె చాంబర్‌లో సత్యప్రసాద్ కలిసి ఈ ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ దేశరక్షణలో ఎన్నో కష్టాలకు ఎదురొడ్డి, ధైర్య సాహసాలతో వీరోచిత సేవలను అందిస్తున్న సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి కృతజ్ఞతా భావనతో భారీ విరాళాలు అందించిన ప్రజలకు, సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఈ సంవత్సరం కూడా విరివిగా విరాళాలు అందించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఆమె ప్రజలను, సంస్థలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, సైనిక సంక్షేమశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు ట్రోఫీని అందజేస్తున్న కెప్టెన్ సత్యప్రసాద్